క్లుప్తంగా

ఉచిత కంటి ఆపరేషన్లు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మండలం దిన్నె దేవరపాడుకు చెందిన 8 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించినట్లు గ్రామానికి చెందిన వేణుగోపాల్ తెలిపారు. ఇటీవల గ్రామంలో సుశీల నేత్రాలయ సంస్థ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 396 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 8 మందికి ఆపరేషన్లు చేయించాలని వైద్యులు సూచించారు. ఈ క్రమంలో ఆ 8 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయించినట్లు ఆయన వివరించారు.

నేడు అష్టావధానం

కర్నూలు కల్చరల్: భావనా ప్రియ సాహిత్య బృందం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువ కవి, దంత వైద్య విద్యార్థి బోరెల్లి హర్ష అష్టావధానం నిర్వహిస్తారని నిర్వాహకులు డాక్టర్ సంజీవరాయుడు, శ్రీనివాసులు తెలిపారు. శతావధాని డాక్టర్ వారణాసి శివరామకృష్ణ సంచాలకులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. అవధాని గంగుల ధర్మరాజు, హనుమంతప్ప, ఆవుల చక్రపాణి యాదవ్, అవశూరు సీతమ్మ, కె.వె. సుబ్బలక్ష్మి, దండెబోయిన పార్వతీ దేవి, వెంకటలక్ష్మి, ఇనాయతుల్లా పృచ్ఛకులుగా వ్యవహరిస్తారని తెలిపారు.

పోరాటాలకు సిద్ధం కావాలి



జెండాను ఆవిష్కరిస్తున్న కె.భాస్కర్

కర్నూలు(సెంట్రల్): ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి కె.భాస్కర్ పిలుపునిచ్చారు. శనివారం మార్క్సిస్టు మహోపాధ్యాయుడు లెనిన్ జయంతి పురస్కరించుకొని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ 54వ ఆవిర్భావ దినోత్సవం సీక్యాంపులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. లెనిన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం మతోన్మాదంతో ప్రజాస్వామ్య విలువలకు పాతరేస్తోందన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కన బెట్టి అమిత్‌షా–మోదీ రాజ్యాంగాన్ని అమలుచేస్తున్నారన్నారు. నాయకులు మనోహర్, సురేష్‌నాయక్, దేవేంద్రగౌడ్, బిన్ను, మధు, చిన్న, రాము, సాయి, దినేష్, నరేష్, రాజు పాల్గొన్నారు.

నేడు బసవేశ్వరస్వామి జయంతి

కర్నూలు(హాస్పిటల్): విశ్వగురు బసవేశ్వర స్వామి 892వ జయంతి వేడుకలను ఈ నెల 24వ తేది కర్నూలు నగరంలోని చిత్తారివీధి, జమ్మిచెట్టు వద్ద ఉన్న బసవేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు బాలభాస్కర్, ఉమా మహేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు, అనంతరం పూజాకార్యక్రమాలు ఉంటాయని, వీరశైవ భక్తాదులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ధరిత్రి పరిరక్షణలో భాగస్వాములు కావాలి

కర్నూలు సిటీ: ధరిత్రి పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, భూగోళ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ అన్నారు. శనివారం ఆ కాలేజీలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ వారి సౌజన్యంతో నిర్వహించిన ధరిత్రి దినోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. మనం నివశిస్తున్న భూగోళాన్ని మంచి నివాస యోగ్యంగా ఉండేటట్లు ప్రతి వ్యక్తి కృషి చేయాలన్నారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ డైరెక్టర్ వి.ఆంజనేయులు, పర్యావరణ కార్యకర్త కొమ్ముపాలెం శ్రీనివాస్, తదితరులు ప్రసంగించారు. ధరిత్రి పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కర్నూలు(సెంట్రల్): సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ కె.ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరాగాంధీ నగర్‌లోని సుందరయ్య భవన్ (సీపీఎం ఆఫీస్)లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామని, బీపీ, షుగర్, పక్షవాతం, ఫిట్స్ వ్యాధులకు వైద్యులు గోపాలం, శివనారాయణ, భరత్, నాగభూషణరావు, కె.సంధ్య, పర్వీన్ హాజరై రోగులకు పరీక్షలు చేస్తారన్నారు. రెండు నెలలకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్, విరుపాక్షి, దసరా, ఇవిల్‌డెడ్ రైజ్, శాకుంతలం, రావణాసుర
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్, విరుపాక్షి, దసరా, ఇవిల్‌డెడ్ రైజ్, విడుదల పార్ట్–1, రుద్రుడు, శాకుంతలం
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : విరుపాక్షి, విడుదల పార్ట్–1, రుద్రుడు
ఐనాక్స్ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్, ఇవిల్‌డెడ్ రైజ్, సుజుమె, విడుదల పార్ట్–1, ది సూపర్ మారియో బ్రదర్స్, హలో మీరా, రావణాసుర
భరత్ కాంప్లెక్స్ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్, బలగం, దసరా
శ్రీరామ : విరుపాక్షి, **రాజ్** : విరుపాక్షి
విజయ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్



కొత్తబస్టాండ్ సమీపంలోని ఈద్గా వద్ద ప్రార్థనలకు హాజరైన ముస్లింలు



ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పకుంటున్న ముస్లింలు



రంజాన్ ప్రార్థనలకు హాజరైన ముస్లిం మహిళలు



ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి





కొత్తబస్టాండ్ వద్ద ఉన్న ఈద్గాలో ప్రార్థనలు చేయిస్తున్న ప్రభుత్వ ఖాజీ సయ్యద్ సలీంబాష ఖాద్రి




ప్రార్థనలకు హాజరైన ముస్లింలు



జొహరాపురం ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు





సంతోష్ నగర్ ఈద్గాలో ప్రార్థనలకు హాజరైన ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్

నెల రోజుల కఠిన నియమాలు, ఉపవాస దీక్షల అనంతరం నెలవంక కనిపించడంతో ముస్లింల పవిత్ర పండుగ రంజాన్‌ను శనివారం జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయమే శుద్ధి స్నానం చేసి కొత్త బట్టలు వేసుకుని అల్లాను స్మరించుకుంటూ ఈద్గాలకు చేరుకున్నారు. ఈద్గా, మసీదుల్లో ఖాజీలు, మౌల్వీలు నమాజు చేయించారు. ఆధ్యాత్మిక ప్రసంగం, ఖురాన్ పఠనం అనంతరం దువా చేశారు. సర్వ మానవాళి శాంతి కోసం, జీవితంలో చేసిన పాపాల విముక్తి కోసం అల్లాను వేడుకున్నారు. అనంతరం ఒకరినొకరు కరచాలనం, ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. తిరిగి ఇళ్లకు చేరుకుని కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో విందు చేసుకుని సంతోషంగా గడిపారు. – సాక్షి ఫొటోగ్రాఫర్



జొహరాపురం ఈద్గాలో ప్రార్థనలు చేయిస్తున్న మత పెద్ద హాఫీజ్ ఫరూఖ్ ఉమ్రి మదాని



గడ్డా ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



సంతోష్ నగర్ ఈద్గాలో ప్రార్థనలు చేయిస్తున్న మత పెద్ద ముఫ్తీ సయ్యద్ మన్సూర్ అహ్మద్



రంజాన్ సందర్భంగా కుటుంబ సభ్యులతో సెల్ఫీ




పుస్తకం.. మంచి నేస్తం

- విజ్ఞాన సముపార్జనకు దిక్సూచి
- నేటి యువతలో తగ్గుతున్న పఠనాసక్తి
- నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం

కర్నూలు కల్చరల్: ఆది మానవుడి నుంచి ఆధునిక మానవుడి వరకు జరిగిన నాగరిక అభ్యుదయ మావన ప్రస్థానానికి సజీవ చిహ్నం పుస్తకం. ఎన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలు వచ్చినా పుస్తక పఠనం ద్వారానే సంపూర్ణ మానవ వ్యక్తిత్వ వికాసం కలుగుతుంది. మేధస్సుతో పాటు మేధావులను తీర్చిదిద్దే జ్ఞానం సిద్ధిస్తుంది. పుస్తకమనే విజ్ఞాన భాండాగారాన్ని శోధించే కొద్ది జ్ఞానమనే సంపద పెరుగుతూనే ఉంటుంది. 1995లో యునెస్కో ఏప్రిల్ 23వ తేదీని పుస్తక దినోత్సవంగా ప్రకటించింది. ఆదివారం 'ప్రపంచ పుస్తక దినోత్సవం' సందర్భంగా కథనం.

పుస్తక పఠనమే విజ్ఞానానికి మూలం

విషయ సంగ్రహానానికి పఠనమే మూలం. పఠనా జిజ్ఞాస విద్యార్థుల్లో కలిగినప్పుడు విస్తృత అధ్యయనానికి, సృజనాత్మకతకు నాంది గీత అవుతుందని మనో విశ్లేషకుల అభిప్రాయం. పుస్తక పఠనం విజ్ఞానాన్ని అందించడమే కాదు.. తార్కిక శక్తిని, ఆలోచనా దృక్పథాన్ని అలవరుస్తుంది. తల్లిదండ్రులు బాల్య ంనుంచి పిల్లలకు పుస్తక పఠనం అలవాటు చేయగలిగితే ప్రతి విషయంపై లోతైన అధ్యయనం చేయడమే కాక ప్రాపంచిక జ్ఞానాన్ని పొందడానికి ఆస్కారం ఉంటుంది.



తగ్గుతున్న పఠనాశక్తి

'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో ఒక మంచి పుస్తకం కొనుక్కో' అన్నారు కందుకూరి వీరేశలింగం పంతులు. గొప్పవారు జనం హృదయాల్లో నిలిచిన వారంతా పుస్తక ప్రియులే. అందుకే ఇప్పటికీ భారత దేశ జనం మనో ఫలకంపై వారి రూపాలు నిక్షిప్తమై ఉన్నాయి. నేటి యువత అందుకు పూర్తి భిన్నం. ఉదయం నిద్రలేచింది మొదలు సెల్‌ఫోన్‌లో వాట్సాప్‌లు, గూగుల్, ఫేస్‌బుక్, టెలివిజన్ కార్యక్రమాలు, ఇ – తరగతుల పేరుతో తెరపై వచ్చే పాఠాలకే పరిమితం అవుతున్నారు. అయ్యవార్లు ముద్రించి ఇచ్చిన నోట్స్ చూసుకొని పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు. రాసే నైపుణ్యం, పఠన సామర్థ్యం క్రమంగా తగ్గిపోతోంది.

ఉమ్మడి జిల్లాలో గ్రంథాలయాలు

జిల్లాలో జిల్లా కేంద్ర గ్రంథాలయం ఒకటి, 58 గ్రంథాలయ శాఖలు, ఒక గ్రామీణ గ్రంథాలయం ఉన్నాయి. 159 పుస్తక సంక్షిప్త కేంద్రాలు ఉన్నాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు ఇతర గ్రంథాలయాల్లో 6,50,400 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కేంద్ర గ్రంథాలయంలో 9500 మంది, మిగతా వాటిల్లో 67,100 మంది శాశ్వత సభ్యులు ఉన్నారు. కేంద్ర గ్రంథాలయంలో ప్రతి రోజు సుమారు 400 మంది పుస్తక పఠనం చేస్తుంటారు. శాశ్వత సభ్యత్వం ఉన్నవారు పుస్తకాలను ఇళ్లకు తీసుకెళ్తూ పఠనాశక్తిని కొనసాగిస్తున్నారు.

పుస్తక పఠనంతో ఉపయోగాలు

- ఊహాశక్తిని పెంపొందించి సరికొత్త భావజాలాన్ని వృద్ధి చేస్తుంది. విషయ పరిజ్ఞానం మాత్రమే గాక మానవీయ నైతిక విలువల వికాసానికి తోడ్పడుతోంది.
- లోక రీతి, నీతి మానవ విభిన్న దృక్పథాలపై అవగాహన కలిగిస్తుంది.
- పుస్తకం భాషలోని నానుడులు, సామెతలు, జాతీయాలు, నుడికారాలు, మాండలికాలు తదితర వాటి ద్వారా భాషా మాధుర్యాన్ని రుచి చూపించి పద పరిజ్ఞానాన్ని పెంపొందిస్తుంది.
- పిల్లలకు కామిక్స్ రూపంలో ఆహ్లాదాన్ని, ఆనందాన్ని ఆలోచనలను అందిస్తుంది.
- పుస్తకాల్లో ఉండే గొప్ప వారి స్వీయ చరిత్రలు, మహనీయుల జీవిత చరిత్రలు, విజయ ప్రస్థానాలు స్ఫూర్తిని కలిగించి మన ఉన్నతికి దోహద పడతాయి.

ఆన్‌లైన్ పఠనం పెరిగింది



ప్రస్తుత తరం యువత ఆన్‌లైన్‌లో పుస్తకాలు చదవడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. ఏ సమాచారమైనా ఏ సమయంలోనైనా అందుబాటులో ఉంటుంది. రీడర్స్ డైజెస్ట్, ఎమర్నాల్డ్ ఈ లైబ్రరీ, ప్రాజెక్ట్ గూటెన్ బర్గ్, ఇంటర్నెట్ ఆర్చివ్, ఓపెన్ లైబ్రరీ, గూగుల్‌బుక్స్, స్మాష్ వర్డ్స్ క్యాటలాగ్ ఆఫ్ ఫ్రీ బుక్స్, బుక్ రిక్స్, అథోరాణా, బుక్ బూన్, వాట్ ప్యాడ్, లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్ లాంటి వెబ్‌సైట్స్‌ను సందర్శించవచ్చు.
– డాక్టర్ ఎమ్.వి.నాగరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆర్‌యూ

విద్యార్థి దశ నుంచే అలవాటు చేయాలి



తల్లిదండ్రులు తమ పిల్లలకు బాల్యం నుంచే పుస్తక పఠనం అలవాటు చేయాలి. ఉపాధ్యాయులు ఆ దిశగా విద్యార్థులను మోటివేట్ చేయాలి. పాఠ్యాంశాలకు సంబంధించినవే కాకుండా విజ్ఞానాభివృద్ధికి ఉపయోగపడే పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలి. గ్రంథాలయాలకు వచ్చి చదువుకునేలా సహకరించాలి.
– పెద్దక్క, ఇన్‌చార్జి కార్యదర్శి, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ

నేటి నుంచి చందన యాత్ర మహోత్సవాలు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం నుంచి చందన యాత్ర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు తెలిపారు. మే 15వ తేదీ వరకు 21 రోజుల పాటు విశేషంగా ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. పరమ పవిత్రమైన వైశాఖ మాసంలో సమస్త మానవాళికి శుభాన్ని కలగజేయడం కోసం జగన్నాథ స్వామి వారికి వైశాఖ సుద్ధ అక్షయ తృతీయ నుంచి ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. స్వామి వారికి చందన సేవ, అలంకార సేవ, అభిషేక సేవ, సంపూర్ణ నిత్య నైవేద్యం సేవలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు ఉత్సవాల్లో పాల్గొనవచ్చని విజ్ఞప్తి చేశారు.

నేడు వార్షికోత్సవం

కర్నూలు కల్చరల్: పతంజలి సాయినాథ్ యోగ శిక్షణ కేంద్రం 33వ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం 6 గంటలకు వీఆర్ కాలనీలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు కేంద్ర కార్యదర్శి రేగూరు బాలకృష్ణ తెలిపారు. యోగాసనాల ప్రదర్శన, సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయని పేర్కొన్నారు.

పంటల బీమా వర్తింపజేయాలి

కర్నూలు(అర్బన్): పంట దిగుబడి సరిగా లేక, పెట్టుబడులు కూడా రాని పరిస్థితుల్లో ప్రభుత్వం అన్ని పంటలకు బీమా వర్తింపజేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి కోరారు. శనివారం జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గతేడాది పత్తి, టమాట, ఉల్లి, మొక్కజొన్న, మిరప పంటలు బాగా దెబ్బతిని దిగుబడి సరిగా రాలేదన్నారు. అధిక, అకాల వర్షం, తెగుళ్లతో పంటలు దెబ్బతిన్నాయని, ఈ నేపథ్యంలో అన్ని పంటలకు బీమా వర్తింపజేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, హనుమంతు, మల్లయ్య, సూరి తదితరులు పాల్గొన్నారు.

సమష్టి సహకారంతోనే సమస్యల పరిష్కారం

కర్నూలు(అర్బన్): బ్రాహ్మణులు ఐక్యంగా ఉంటూ సమష్టిగా సహకారం అందిస్తే సమస్యలను పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటరామరాజు అన్నారు. శనివారం సాయంత్రం నగర శివారులోని రాగమయూరి గ్రీన్‌హిల్స్ శ్రీ సరస్వతి అమ్మవారి దేవస్థానంలో బ్రాహ్మణ సమాఖ్య ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివిధ సందర్భాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. సమాఖ్య రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ కన్వీనర్ పసుపుల మురళీకృష్ణ, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్ శర్మ, నాయకులు కాళి ప్రసాద్, హనుమంతరావు, యోగేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్.వెంకటరామరాజు

అక్రమ మద్యం ధ్వంసం

కర్నూలు: అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన పొరుగు రాష్ట్రాల మద్యాన్ని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు ధ్వంసం చేశారు. కర్నూలు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్ గౌడ్, కర్నూలు సెబ్ స్టేషన్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం రూ.2 లక్షల విలువ చేసే మద్యంను ధ్వంసం చేశారు. వివిధ కేసుల్లో పట్టుబడిన 5,715 మద్యం టెట్రా ప్యాకెట్లు, 1,411 లీటర్ల నాటుసారాను నగర శివారులోకి తీసుకెళ్లి వాహనాలతో తొక్కించి నేలపాలు చేశారు.

ఒకేరోజు రూ.16 లక్షల పన్ను వసూలు

కర్నూలు (టౌన్): సెలవు రోజుల్లోనూ నగరపాలక పన్ను కౌంటర్లు పనిచేయడం ద్వారా రెవెన్యూ విభాగానికి గణనీయంగా ఆదాయం సమకూరుతోంది. శనివారం రంజాన్ పండుగకు నగరపాలక సంస్థ కార్యాలయానికి సెలవు ఉంది. అయినా పన్ను దారుల సౌలభ్యం కోసం ప్రత్యేక కౌంటర్లు పనిచేశాయి. దీంతో నగరవాసులు పలువురు పన్నులు చెల్లించేందుకు ముందుగా వచ్చారు. ఒకేరోజు ఆస్తి పన్ను కింద రూ.14.26 లక్షలు, నీటి పన్ను కింద రూ. 1.12 లక్షలు, ట్రేడ్ లైసెన్సు ద్వారా రూ.3,750 చొప్పున పన్నులు వసూలయ్యాయి. మొత్తం రూ. 16.14 లక్షలు వసూలైనట్లు నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మేనేజర్ చిన్నరాముడు వెల్లడించారు.



పన్నుల చెల్లింపులను పర్యవేక్షిస్తున్న నగర పాలక మేనేజర్ చిన్నరాముడు

5 శాతం రాయితీని వినియోగించుకోండి

2023–2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తు పన్ను చెల్లించే వారికి ప్రభుత్వం 5 శాతం రాయితీ ఇస్తున్నట్లు నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ వెల్లడించారు. ఈ నెలాఖరు వరకు 5 శాతం రాయితీతో పన్నులు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. పన్ను చెల్లింపు దారుల కోసం ఆదివారం సైతం ప్రత్యేక పన్ను కౌంటర్లు పనిచేస్తాయని తెలిపారు.

25 నుంచి వేసవి శిబిరం

కర్నూలు కల్చరల్: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి మే 8వ తేదీ వరకు చిన్మయ బాలల వేసవి సాధనా శిబిరం నిర్వహించనున్నట్లు స్వామిని సుప్రేమానంద సరస్వతి పేర్కొన్నారు. వీఆర్ కాలనీలో చిన్మయ ప్రభావళి ప్రతి రోజు ఉదయం 7.30 నుంచి 1 గంట వరకు శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. 5 నుంచి 15 సంవత్సరాల వయసుగలవారు శిబిరంలో పాల్గొనవచ్చని తెలిపారు. నైతిక విలువలు, భగవద్గీత, యోగా– ధ్యానం తదితర వాటిపై శిక్షణ ఉంటుందని వెల్లడించారు.

ఆర్‌యూకు వేసవి సెలవులు ఇప్పించాలి

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కాలేజీలకు వేసవి సెలవులు ఇప్పించాలని కోరుతూ ప్రభుత్వ డిగ్రీ కాలేజీల లెక్చరర్స్ అసోసియేషన్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీల విలీన సిబ్బంది సంఘం నాయకులు శనివారం పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి విన్నవించారు. ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు యూనివర్సిటీల పరిధిలో డిగ్రీ కాలేజీలకు వేసవి సెలవులు ప్రకటించారన్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో విద్యార్థులు, అధ్యాపకుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వేసవి సెలవులు ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ విషయంపై వర్సిటీ వీసీకి ఎమ్మెల్యే ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు. దీంతో రెండు రోజుల్లో విజయవాడకు వెళుతున్నానని, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి సెలవులు ఇప్పించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీఇచ్చారు. ఆయా సంఘాల నాయకులు డి నాగన్న, దలవాయి శ్రీనివాసులు, ఎస్.సోమశేఖర్ ఉన్నారు.

నేడు కళాకారులకు సన్మానం

కర్నూలు కల్చరల్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని 'మత సామరస్యం – శాంతి సందేశం' పేరుతో ఆదివారం సాయంత్రం 6 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. హిందూ, ముస్లిం కవులు పాల్గొంటారని పేర్కొన్నారు. 2013 –2023 వరకు నంది, గరుడ, కందికూరి తదితర జాతీయ స్థాయి అవార్డులు అందుకున్న 10 మంది కళాకారులను సన్మానించనున్నట్లు తెలిపారు. సెర్ప్ సీఈఓ ఐఏఎస్ ఏఎండీ ఇంతియాజ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు.

అల్లా చూపిన మార్గంలో నడవాలి

కల్లూరు: అల్లా చూపిన మార్గంలో నడుస్తూ పేదలకు చేతనైన సాయం చేయాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పవిత్ర రంజాన్ సందర్భంగా కల్లూరు అర్బన్ 35వ వార్డులోని మసీదులో జరిగిన నమాజ్‌లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మసీదు కమిటీ సభ్యులు, కార్పొరేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

– కల్లూరు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులో ప్రవక్తలు ఖురాన్ చదివి వినిపించారు. ప్రతి ఒక్కరు ఇతరుల పట్ల ప్రేమ, దయ కలిగి ఉండాలన్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



కల్లూరులో రంజాన్ ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

24న రాయలసీమ కర్తవ్య దీక్ష

కర్నూలు సిటీ: రాయలసీమ ప్రాంతానికి నిధులు, నీళ్లు, నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలని, అప్పర్‌భద్ర ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ ఈ నెల 24వ తేదీన రాయలసీమ కర్తవ్య దీక్ష చేపట్టనున్నారు. ఈ దీక్షకు సంబంధించిన పోస్టర్లను రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆ కమిటీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు సీమ కృష్ణ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగు నీటి విషయంలో అన్యాయం చేస్తూ అప్పర్ భద్ర ప్రాజెక్టును ఎగువ రాష్ట్రంలో నిర్మిస్తున్నారని, దీని వల్ల దిగువన ఉన్న సీమ జిల్లాలకు తుంగభద్ర జలాల్లో తీరని అన్యాయం జరుగుతుందన్నారు. సిద్ధేశ్వరం – సంగమేశ్వరం వద్ద తీగల బ్రిడ్జికి బదులు రోడ్ కమ్ బ్యారేజీ నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24వ తేదీన రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఎస్టీబీసీ కాలేజీలో దీక్ష చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. దీక్షకు పెద్ద ఎత్తున సీమ వాసులు తరలి రావాలని పిలుపునిచ్చారు. కమిటీ సభ్యులు మల్లప్ప, హరినాయుడు, భూషన్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న స్టీరింగ్ కమిటీ నాయకులు